# కులవృత్తులకు పూర్వవైభవం



- అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా
- మేదరి కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరు

కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా

ఖలీల్‌వాడి, నవంబర్ 8 : సీఎం కేసీఆర్ కులవృత్తులకు పూర్వవైభవం తీసుకువచ్చారని అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా అన్నారు. జిల్లాకేంద్రంలోని విజయ్ కిసాన్ మున్నూరు కాపు సంఘంలో మేదరి కులస్తుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిగాల హాజరై మాట్లాడారు. మేదరి కులస్తుల అభ్యున్నతికి అండగా ఉంటామన్నారు. జిల్లాకేంద్రంలోని బురుడుగల్లీలో మేదరి సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం రూ. 10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన తర్పలకు కూడా నిధులు మంజూరు చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన బీసీబంధు పథకం ద్వారా నగరంలోని 26 మంది మేదరి కులస్తులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. మిగతా వారికి కూడా అందజేస్తామని హామీ ఇచ్చారు. నగరాన్ని తొమ్మిదేండ్లలో ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. ప్రతి డివిజన్‌లోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, నగరంలోని ప్రధాన రోడ్లను విస్తరింపజేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందజేస్తున్నామన్నారు. నగరంలో వైకుంఠధామాలు, ఐటీ హబ్, న్యాక్ భవన్, ఓపెన్ జిమ్‌లు, పార్కులు, క్రీడా ప్రాంగణాల నిర్మాణంతోపాటు నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన అంశాలను అధికారంలోకి రాగానే అమలుచేస్తామన్నారు. నగరం మరింత అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. కారు గుర్తుకే ఓటు వేసి తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, నాయకులు, మేదరి కులస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల నామినేషన్

ఖలీల్‌వాడి, నవంబర్ 8 : బీఆర్‌ఎస్ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా నేడు (గురువారం) నామినేషన్ వేయనున్నారు. గత ఎన్నికల్లో అంబాసిడర్ కారును ఎమ్మెల్సీ కవిత నడపుతూ ఉంటే బిగాల అందులో వెళ్లి నామినేషన్ వేశారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో ఈ సారి కూడా అదే సెంటిమెంట్‌తో మున్సిపల్ కార్యాలయంలో బిగాల నామినేషన్ వేయనున్నారు.

## ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన వైద్యులకు సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న ఐఎంఏ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఖలీల్‌వాడి, నవంబర్ 8 : జిల్లాకేంద్రానికి చెందిన వైద్యులు చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి ఎవరెస్ట్ శిఖరాన్ని బేస్ క్యాంప్ 5,363 మీటర్లు ఇటీవల అధిరోహించారు. వారిని ఐఎంఏ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. అమెరికాలో 42 కిలోమీటర్ల మారథాన్ పూర్తిచేసిన రజనీశ్‌ను కూడా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు జలగం తిరుపతిరావు, నాగమోహన్, భూమారెడ్డి, రాఘవేందర్, నరేశ్, దినేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్, ఆనంద్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారుల కోసం ప్రత్యేక సౌకర్యాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 8 : కార్తీకమాసం నుంచి ఆరంభమయ్యే అయ్యప్ప దీక్షాధారుల కోసం నగరంలోని అయ్యప్ప ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు భక్తవత్సలం తెలిపారు. అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో మాలధారుల కోసం ఏర్పాట్లపై కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. నిజామాబాద్ నగరంతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు అయ్యప్పదీక్ష చేపడుతున్నారని, వారందరికీ కనీస సౌకర్యాలతో పాటు భిక్ష, పూజ తదితర ఏర్పాట్లను ఆలయ కమిటీ చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## 12న ధనలక్ష్మి పూజలు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 8 : దీపావళి పండుగను ఈనెల 12న (ఆదివారం) జరుపుకోవాలని తెలంగాణ గాయత్రి ధార్మిక సేవాసమితి అధ్యక్షుడు ప్రకాశ్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 4.05 నుంచి 7.45 గంటలకు నరక చతుర్దశి మంగళహారతులు తీసుకోవాలని, మధ్యాహ్నం 2.35 నుంచి రాత్రి 7.35 గంటలకు తిరిగి 8 నుంచి అర్ధరాత్రి వరకు ధనలక్ష్మీ పూజలు, ఉత్తర పూజలు జరుపుకోవాలని సూచించారు. ఈనెల 10న ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ధన త్రయోదశి పూజలు, 11న శనిత్రయోదశి, మాసశివరాత్రి, 13న సోమవతి అమావాస్య, కేదారేశ్వర వ్రతాలు, వ్యాపార ఖాతా పుస్తకాల పూజలు, 14న కార్తీక బలిపాడ్యమి, యమ ద్వితీయ, భగినీ హస్త భోజనం జరుపుకోవాలని తెలిపారు.

## బిగాలకు మద్దతుగా విస్తృత ప్రచారం



నగరంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖలీల్‌వాడి, నవంబర్ 8 : బీఆర్‌ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తాకు మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నగరంలోని అన్ని డివిజన్లలో ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, నాయకులు బుధవారం ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కారు గుర్తుకే ఓటు వేసి బిగాలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## పొద్దుటూరి అపార్ట్‌మెంట్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

ఖలీల్‌వాడి, నవంబర్ 8 : నగరంలోని గంగస్థాన్ ఫేస్–2లో ఉన్న పొద్దుటూరి ల్యాండ్‌మార్క్ (పీఎల్‌ఎం) అపార్ట్‌మెంట్ కార్యవర్గాన్ని మంగళవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోస్కెవార్ సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పుల్లెల అశోక్‌బాబు, కోశాధికారిగా గోపిశెట్టి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా రవికుమార్‌తోపాటు ముగ్గురిని సలహాదారులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పూర్వ కమిటీ ప్రతినిధులు రవీందర్, గంగాధర్‌తోపాటు అపార్ట్‌మెంట్ సభ్యులు కాశీరెడ్డి, లడ్డు శంకర్, శ్రీనివాస్‌గౌడ్, మురళి, సూరన్నగారి నర్సాగౌడ్, సంపత్‌రెడ్డి, సాయిలు, అందె సాయిలు, నీలకంఠం పాల్గొన్నారు. నూతన కార్యవర్గం రెండేండ్లపాటు కొనసాగనున్నట్లు సభ్యులు తెలిపారు.

## రేపు పెన్షన్ అదాలత్

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 8 : పీఎఫ్ ఉద్యోగుల పెన్షన్ అదాలత్‌ను శుక్రవారం నిర్వహించనున్నట్లు పీఎఫ్ రీజినల్ కమిషనర్ –1 గణేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల పెన్షన్ స్కీం, పెన్షనర్ల సమస్యలకు సంబంధించి ఉదయం 11.00 నుంచి 11.40 గంటల వరకు వీడియోకాన్ఫరెన్స్ ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు webex వెబ్‌సైట్‌లో మీటింగ్ నంబర్ 2642 837 1437, పాస్‌వర్డ్ ENF1234తో లాగిన్ అయ్యి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని సూచించారు.

## నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో రథయాత్ర

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 8 : ప్రజల్లో భక్తి, ధార్మికచింతనను పెంపొందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి రథయాత్రను బుధవారం నిర్వహించారు. నగరంలోని పలు వీధుల గుండా రథయాత్ర కొనసాగింది. హనుమాన్‌దీక్ష గురుస్వామి నాగభూషణం మాట్లాడుతూ.. తిరుమల కొండ అంజనాద్రిపై ఆంజనేయస్వామి స్వయంభుగా వెలిశారని అన్నారు. అయోధ్యలో జనవరి 21న నిర్వహించే సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా తిరుపతిలో అఖండ హనుమాన్ చాలీసా మహాయజ్ఞాన్ని టీటీడీ పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శ్రీవారి రథయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

## నగరంలోని గోదాంపై పోలీసుల దాడి

- తుపాకీ, కత్తులు లభ్యం
- సీరియస్‌గా పరిగణించిన సీపీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు, కొడవలి, గన్

నిజామాబాద్ క్రైం, నవంబర్ 8 : జిల్లాకేంద్రంలోని ఓ గోదాంపై పోలీసులు మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. అందులో మారణాయుధాలు తయారుచేసే కర్మాగారాన్ని చూసి ఖంగుతిన్నారు. నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ వెంకటనారాయణతోపాటు సీసీఎస్ సీఐ రమేశ్, ఎస్సై రవీందర్ ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజాంకాలనీలో ఉన్న ఓ గోదాంపై దాడిచేశారు. గోదాంలో అప్పుడే తయారుచేస్తున్న కత్తులతోపాటు పిస్టోల్, కొడవలి లభించడంతో పోలీసులు విస్తుపోయారు. గోదాం నిర్వాహకులు మాలపల్లికి చెందిన హంజాల మీర్‌బేగ్, అమీర్ అలీఖాన్‌గా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, బొలెరో వాహనం, గూడ్స్ వెహికిల్‌ను సీజ్ చేసినట్లు నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తమై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అల్లర్లు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో గోదాంలో మారణాయుధాలు, గన్ లభించడంతో ఈ ఘటనను సీపీ కల్మేశ్వర్ సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం.

## రైస్‌మిల్‌పై టాస్క్‌ఫోర్స్ టీమ్ దాడి

- 54 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

నిజామాబాద్ క్రైం, నవంబర్ 8 : జిల్లాకేంద్రంలోని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ టీమ్ బుధవారం దాడి చేసింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు అజయ్, అంజయ్య, సిబ్బంది దుబ్బ ప్రాంతంలోని వెంకటరామయ్య రైస్‌మిల్‌పై దాడి చేశారు. రైస్‌మిల్లులో 54 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. వీటి విలువ రూ.8 లక్షల 50 వేలు ఉంటుందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం పీడీఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సైకి అప్పగించినట్లు తెలిపారు. దాడి చేసిన వారిలో టాస్క్‌ఫోర్స్ టీమ్ రాంచందర్, అనిల్, సుధాకర్, రాములు, భూషణ్, నర్సయ్య, లస్మన్న, గజేందర్, ఆజాం తదితరులు పాల్గొన్నారు.